Eenadu 01–04/12/17.

# సకుటుంబ సపరివార సమేతంగా!

## మెట్రో ప్రయాణానికి తరలిన నగరవాసులు

ఈనాడు, హైదరాబాద్

అగ్ర కథానాయకుడి సినిమా విడుదలైన రోజు ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని థియేటర్ల దగ్గర రద్దీ... సంక్రాంతి పండుగకు ఊరు వెళుతుంటే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో కిక్కిరిసే జనం... ఈ తరహా దృశ్యాలు... మెట్రో స్టేషన్లలో కనిపించాయి. సెలవు రోజైన ఆదివారం పార్కులు వెలవెలబోయాయి... సినిమా హాళ్లు ఖాళీగా మారాయి... అమీర్‌పేటలోని మెట్రోరైలు ఇంటర్‌చేంజ్ స్టేషన్ కిక్కిరిసింది. మిగతా స్టేషన్లలోనూ దాదాపు ఇదే పరిస్థితి. మెట్రోరైళ్లన్నీ అడుగు తీసి అడుగు పెట్టలేనంతగా ప్రయాణికులతో నిండిపోయాయి.

● ఉదయం వేళ జనం కాస్త తక్కువగా... మెట్రో రైళ్లు ఖాళీగానే రాకపోకలు సాగించాయి. పది గంటల తర్వాత క్రమంగా రద్దీ పెరిగింది. సాయంత్రానికి స్టేషన్లలో చూస్తే కౌంటర్ల దగ్గర భారీ వరుసలు కనిపించాయి.

● ప్రారంభ స్టేషన్లలోనే రైళ్లన్నీ నిండటంతో మధ్య స్టేషన్లలో ప్రయాణికులు ఎక్కేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

● మియాపూర్ స్టేషన్ దగ్గర కల్వరీ టెంపుల్ ఉండటంతో ప్రయాణికులు ఇక్కడికి చేరుకోవడానికి ఈసారి మెట్రోను ఉపయోగించుకున్నారు.

● స్టేషన్ పక్కనే ఏర్పాటు చేసిన

...మిగతా 4లో

● మెట్రో స్టేషన్లలో నాలుగైదు చోట్ల మినహా పార్కింగ్ సదుపాయం లేదు. నాగోల్, మియాపూర్, రసూల్‌పురా ప్రాంతాల్లో మినహా మిగతా చోట్ల పాదచారుల బాటలపై వాహనాలు నిలపడంతో ప్రయాణికులు స్టేషన్‌లోపలికి వెళ్లడానికి ఇబ్బంది పడ్డారు.



● స్టేషన్లలో జనం రద్దీ కారణంగా కౌంటర్ల దగ్గర ఎక్కువసేపు ఎదురుచూడాల్సి వచ్చింది. దాహం వేసినా ఎక్కడా నీళ్లు లభించని పరిస్థితి స్టేషన్లలో నెలకొంది.



మియాపూర్‌లో మెట్రో పైలాన్ వద్ద జనం సందడి

## సకుటుంబ సపరివార సమేతంగా!

(మొదటిపేజీ తరువాయి) స్ట్రీట్ ఫర్నిచర్, కళాకేంద్రాల్లో పిల్లలు, పెద్దలతో సాయంకాలం నుంచి రాత్రి వరకు గడపటం విశేషం.

● మెట్రో ఎక్కేందుకు సొంత వాహనాల్లో రావడంతో పార్కింగ్ సమస్యలు ఏర్పడ్డాయి. అమీర్‌పేటలో ప్రయాణికుల తాకిడికి ట్రాఫిక్ సమస్యలు ఏర్పడటంతో పోలీసులు జోక్యం చేసుకుని నియంత్రించాల్సి వచ్చింది.

● సికింద్రాబాద్ ఈస్ట్ స్టేషన్ దగ్గర మూడు మార్గాలే ఉండటంతో ఇక్కడ ఒక వైపు నుంచే దిగాల్సిన పరిస్థితి. దీంతో కిందకు వచ్చాక రహదారి దాటుతుండటంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి.

**నగర అందాలకు ఫిదా ..** బిర్లా మందిర్, గోల్కొండ, చార్మినార్ ఎక్కితే తప్ప నగర అందాలను చూసే అవకాశం లేదు. మెట్రో రాకతో మారిన నగరాన్ని, సోయగాలను, ఆకాశ హర్మ్యాల్ని చూస్తూ కొత్త అనుభూతికి లోనవుతున్నారు. ప్రయాణికుల్లో అధికశాతం నాగోల్ నుంచి బయలుదేరి మియాపూర్ వెళ్లి... అక్కడి నుంచి తిరిగి వెనక్కి మళ్లుతున్నారు. మియాపూర్ నుంచి బయలుదేరిన వారూ ఇలాగే దూర ప్రయాణం చేస్తుండటంతో మెట్రో లోపల అత్యంత రద్దీ నెలకొంది. పిల్లలే కాదు.. ఇంట్లో పెద్దలు మెట్రోపై మనసు పారేసుకుంటున్నారు.

**'షి' బృందాల ప్రచారం...** మెట్రోరైళ్లలో నగర షి బృందాల సభ్యులు ఆదివారం సాధారణ ప్రయాణికుల్లా రాకపోకలు సాగించారు. మహిళలకు ఏమైనా వేధింపులు ఎదురవుతున్నాయా? ఆకతాయిలు పోకిరీ వేషాలేస్తున్నారా? అని ప్రత్యేకంగా ఆరా తీశారు. రహస్య కెమెరాలతో వీడియోలు తీశారు.